తెలంగాణ
# నేత్రం
తెలుగు దినపత్రిక
ప్రజల కోసం పోరాటం



సంపుటి: 02 సంచిక: 203 | శుక్రవారం 02-05-2025 | పేజీలు: 4 రూ. 5.00

# అమరావతి రైతులను కోటీశ్వరులను చేస్తున్నాం: చంద్రబాబు

**- ఆత్మకూరు నుంచి 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన సీఎం**

**- కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య**

**- అమరావతిలో భూముల విలువ పెరిగిందన్న చంద్రబాబు**




మేడే సందర్భంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించి, రాష్ట్రంలోని కార్మికులు, అభివృద్ధి ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో అత్యధికంగా అసంఘటిత కార్మికులే ఉన్నారని, గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో వారు అనేక కష్టనష్టాలకు గురయ్యారని అన్నారు. ఇసుక ద్వారా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉన్నప్పటికీ, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆ ఆదాయాన్ని వదులుకుని ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి తోడుగా నాలా చట్టాన్ని కూడా రద్దు చేసినట్లు ఆయన వెల్లడించారు. కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి ఆరోగ్య అవసరాల కోసం కర్నూలు, గుంటూరులలో వంద పడకల సామర్థ్యంతో ప్రత్యేక ఆసుపత్రులను నిర్మిస్తున్నామని వివరించారు. రాజధాని అమరావతి నిర్మాణం ద్వారా ఆంధ్ర యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం కోసం రైతులు స్వచ్ఛందంగా తమ భూములను ప్రభుత్వానికి అప్పగించారని గుర్తుచేశారు. ఆ భూములను అభివృద్ధి చేసి, కొంత భాగాన్ని తిరిగి రైతులకే ఇవ్వడం ద్వారా వారిని కోటీశ్వరులను చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో భూముల విలువ గణనీయంగా పెరిగిందని ఆయన అన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నామని, మొత్తం 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులను నెలకొల్పుతామని చంద్రబాబు ప్రకటించారు. అయితే, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కొందరు ఓర్వలేకపోతున్నారని ఆయన పరోక్షంగా వైసీపీని విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.

# ఆర్టీసీని కాపాడుకునే బాధ్యత మీదే

**- రేవంత్ రెడ్డి**

**- సమ్మె విరమించుకోవాలని ఆర్టీసీ కార్మికులకు రేవంత్ విన్నపం**

**- ఆర్టీసీ క్రమంగా లాభాల బాట పడుతోందన్న సీఎం**

**- సమ్మె వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుందని వ్యాఖ్య**




మే డే ఉత్సవాల వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీఎస్ఆర్టీసీ కార్మికులకు కీలక విజ్ఞప్తి చేశారు. సంస్థ ఇప్పుడిప్పుడే ఆర్థికంగా కోలుకుంటున్న తరుణంలో, సమ్మె ఆలోచనను విరమించుకోవాలని ఆయన కార్మికులను కోరారు.

"ఆర్టీసీ సంస్థ క్రమంగా లాభాల బాట పడుతోంది. ఇది మీ అందరి సంస్థ. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉంది" అని ఆయన అన్నారు. కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకుండా సంయమనం పాటించాలని హితవు పలికారు.

ఏవైనా సమస్యలు ఉంటే, వాటిని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువచ్చి, చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. సంస్థకు లభించే ఆదాయం విషయంలో పూర్తి పారదర్శకత పాటిస్తామని స్పష్టం చేశారు. "వచ్చే ఆదాయమంతా మీ చేతిలోనే పెడతాం. దానిని ఎలా ఖర్చు చేయాలో మీరే సూచించండి. అణా పైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లను. అంతా మీ కోసమే ఖర్చు చేస్తాం" అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

అదే సమయంలో, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఆశాజనకంగా లేదని సీఎం గుర్తుచేశారు. "గత పదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం, ఆర్థిక దోపిడీ జరిగాయి. ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. మరో ఏడాదిలో కొంత మెరుగవుతుంది. ఈ తరుణంలో సమ్మెకు దిగడం వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుంది. దయచేసి ఆలోచించండి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో ఏమీ చేయని వారు ఇప్పుడు తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయవచ్చని, వారి మాటలు నమ్మవద్దని కార్మికులను హెచ్చరించారు.

"కష్టమైనా, నిష్ఠూరమైనా ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది. ఆర్టీసీ కార్మికులు నన్ను నమ్మండి. నమ్ముకున్న మీకు నేను అండగా ఉంటాను" అని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# అంగన్వాడీలకు వేసవి సెలవులు

**గురువారం నుండి నెలరోజుల పాటు అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు**




హైదరాబాద్: అంగన్ వాడీ కేంద్రాలకు గురువారం నుంచి నెల రోజుల పాటు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. తల్లిదండ్రులు, అంగన్ వాడీ యూనియన్ల విజ్ఞప్తి మేరకు మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క నిర్ణయం తీసుకున్నారు. ఆమె ఆదేశాల మేరకు అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అమీర్ పేట వెంగళరావునగర్ లోని కమిషనరేట్ లో అంగన్ వాడీ యూనియన్ నేతలతో డైరెక్టర్ కాంతి వెస్లీ సమావేశమయ్యారు. అనంతరం సెలవులు ప్రకటించారు.

ఎండలు మండుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సెలవుల్లో కూడా అంగన్ వాడీ పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు గుడ్లు, సరుకులు అందిస్తామని డైరెక్టర్ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ నెల రోజులు అంగన్ వాడీ టీచర్లు ఇంటింటి సర్వే, ఇండ్లకు వెళ్లి ఆరేండ్ల లోపు పిల్లలను అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డైరెక్టర్ ఆదేశించారు. సెలవులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి యూనియన్లు ధన్యవాదాలు తెలిపారు.

కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు గుడ్ న్యూస్:

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల్లో పనిచేస్తున్న సీఆర్టీలు కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల లకు 21 రోజుల సమ్మెకాలంకు వేతనాలు, మరణిస్తే అంత్యక్రియల కోసం రూ.30 వేలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బుధవారం ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులను ఐటీడీఏల నుంచి చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి సీతక్కకు, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్ కు 2వేల టీచర్ కుటుంబాలు, తెలంగాణ అశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ టీచర్ సంఘం నేతలు ధన్యవాదాలు తెలిపారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ అంధుల, బధిరుల ఆశ్రమ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో, వైకల్యాన్ని ఎదిరించి విద్యార్థులంతా ఉత్తీర్ణులు కావటం అభినందనీయమని, ఇతర విద్యార్థులకు వీరు ఆదర్శమన్నారు.

# భారత్ ఎన్నికల సంఘం కీలక నిర్ణయం




హైదరాబాద్: నకిలీ ఓట్లను కట్టడి చేయడానికి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. బోగస ఓట్ల ఏరివేతే లక్ష్యంగా మూడు విధానాలను కమిషన్ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయనున్నట్లు తెలిపింది.

ఇందుకోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి మరణాల సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు తీసుకుంటామని వెల్లడించింది. చనిపోయిన వారి కుటుంబీకుల నుంచి విజ్ఞప్తి వచ్చేంతవరకు వేచి చూడకుండా.. ఆర్జీఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారు" అని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఓటరు సమాచార చీటీ మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా దాని డిజైన్‌ను మార్చాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సీరియల్ నంబర్, పార్టు నంబర్ల సైజును పెంచనున్నట్లు తెలిపింది. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్లను తేలికగా గుర్తించడంతోపాటు అటు పోలింగ్ అధికారులకు కూడా జాబితాలోని పేర్లను సులభంగా సరిచూసుకునే వీలుంటుంది.

దీంతోపాటు బూత్ స్థాయి అధికారులకు కూడా ఫొటో ఐడీ కార్డులను జారీ చేయనున్నట్లు ఈసీ వెల్లడించింది.

# ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయాలి: మోడీ




ముంబయి: భారత్ ఎంటర్ టైన్ మెంట్ హబ్ గా మారుతుందని భారత్ ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్ ను మోడీ ప్రారంభించారు. వేవ్స్ సదస్సుకు సినీ ప్రముఖులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సృజనాత్మక హబ్ గా తయారై కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. సంప్రదాయ, నవతరాలను సమన్వయం చేయాలని సూచించారు. మనదేశంలో 1913 లో తొలి చిత్రం రాజా హరిశ్చంద్ర విడుదలైందన్నారు. గేమింగ్ రంగంలో యువతకు అనేక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 50 దేశాల గాయకులు కలిసి వైష్ణవ జనతో గీతం ఆలపించారని పేర్కొన్నారు. ప్రతిభ, సృజనాత్మకతల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయాలని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు.

# కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశాల్లో దేశ జనాభా లెక్కలతోపాటు, కులగణన కూడా చేపట్టాలనే సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

కాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి, కేబినెట్ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ మినహా ఇతర కులాలను పరిగణనలోకి తీసుకునేవారు కాదని, ఈ విషయంపై రాహుల్‌గాంధీ ఎన్నోసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని గుర్తు చేశారు.

దీంతో రాహుల్ గాంధీ విజన్ నెరవేరబోతోందని అన్నారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన చేశామని, ఇది స్వతంత్ర దేశంలోనే మొదటిదని, తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి ఆదర్శం అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సామాజిక, ఆర్థిక, కుల సర్వే నిర్వహించడం జరిగిందని.. జనాభాలో 56.32 శాతం మంది వెనుకబడిన కులాలకు చెందినవారని తేలిందని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వాలని అసెంబ్లీలో ఆమోదముద్ర వేశామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల గణనకు అంగీకరించాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలియజేశామని గుర్తు చేశారు.

# శ్రామికులందరికీ ఉచిత ప్రమాద బీమా సౌకర్యం

**- మేడే సందర్భంగా శ్రామికులతో పవన్ ముఖాముఖి**

**- కూలీలను ఇకపై 'ఉపాధి శ్రామికులు'గా పిలవాలని సూచన**




దేశ నిర్మాణంలో శ్రామికుల పాత్ర అత్యంత కీలకమని, వారు లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కార్మిక దినోత్సవం (మేడే) పురస్కరించుకుని ఈరోజు ఆయన శ్రామికులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, శ్రామికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఇకపై కార్మికులను 'కూలీలు' అని కాకుండా 'ఉపాధి శ్రామికులు' అని గౌరవంగా సంబోధించాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే వారికే అత్యధిక గౌరవం దక్కాలని అన్నారు. 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' అనేది చాలా ముఖ్యమని, కండలు కరిగించి పనిచేసే శ్రామికులు లేకపోతే దేశంలో ఎలాంటి ప్రగతి ఉండదని చెప్పారు. తాము ఓట్ల కోసం కాకుండా సేవా దృక్పథంతో పనిచేస్తున్నామని, మూగజీవాల దాహార్తిని తీర్చడానికి కూడా పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే శ్రామికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు. ఇందులో భాగంగా, పని ప్రదేశంలో ప్రమాదవశాత్తూ మరణించిన ఉపాధి శ్రామికుడి కుటుంబానికి అందించే పరిహారాన్ని రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షలకు పెంచుతున్నట్లు కీలక ప్రకటన చేశారు.

# ప్రతి 4 నెలలకు ఒక కమిషనర్...

## ఇదేం పాలనా... గ్రేటర్ హస్తవ్యస్తం

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్?.దేశంలోనే పెద్ద కార్పొరేషన్లలో ఒకటి. వేలాది కోట్ల రూపాయల బడ్జెట్. కోటి మందికి పైగా జనాభా. అలాంటి కార్పొరేషన్ లో పథకాలు అమలు చేయాలన్నా?ప్రాజెక్టులు టేకప్ చేయాలన్నా.. పనులు- ప్రాధాన్యతలు- అవసరాలను బట్టి చేపట్టాలన్నా వాటిపై ఉన్నతాధికారులకు సరైన అవగాహన ఉండాలి.16నెలల్లో నలుగురు కమిషనర్లు ఇదీ మన జీహెచ్ఎంసీ పరిస్థితి అన్న టాక్ తెలంగాణ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. హైదరాబాద్ నగరాభివృద్ధికి జీహెచ్ఎంసీ అనేది గుండెకాయ లాంటిది. అలాంటి జీహెచ్ఎంసీలో పట్టుమని 16నెలలు కూడా కాలేదు. అప్పుడే నలుగురు కమిషనర్లు మారారు. దీంతో నగరాభివ్రుద్ధి కొంత కుంటుపడుతోందన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. ఎందుకంటే జీహెచ్ఎంసీ 625 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన భారీ లోకల్ బాడీ. చావు పుట్టుకల లెక్కల నుండి మొదలుకొని వేలాది కోట్ల రూపాయల ప్రాజెక్టుల టేకప్ వరకు అనేక పనులు సిటిజన్స్ కు చేసి పెట్టాల్సిన సంస్థ.

ఇలాంటి ముఖ్యమైన గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పోస్ట్ అంటే అంత ఆషామాషి కాదు. ఉదయం పారిశుధ్యం నుండి మొదలుకొని రాత్రి స్ట్రీట్ లైట్స్ వరకు పనులన్నింటినీ చక్కబెట్టాలి. ఇలాంటి ముఖ్యమైన కార్పొరేషన్ లో అన్ని పనులను అధికారులతో సమన్వయంతో కలిసి ముందుకు తీసుకెళ్లాలి. ఒక్కమాటలో చెప్పాలంటే బల్దియా బాస్..ఆల్ ఇన్ వన్ అని చెప్పాలి. అయితే జీహెచ్ఎంసీకి వస్తున్న అధికారులు ముచ్చటగా మూడు-నాలుగు నెలలు కాకముందే సీటు మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.2023 సాధారణ ఎన్నికల కంటే కొద్ది నెలల ముందే జీహెచ్ఎంసీకమిషనర్ గా వచ్చిన రోనాల్డ్ రోస్ ను ఎన్నికలు పూర్తైన తర్వాత ఏడు నెలల్లోనే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. ఆ స్థానంలో అమ్రపాలి కాటానుగా నియమించింది. రెండు నెలలు ఇంచార్జిగా కొనసాగించి ఆ తర్వాత పూర్తిస్థాయిలో మరో రెండు నెలలు అవకాశం కల్పించింది.అమ్రపాలి కేవలం 4 నెలలు మాత్రమేజీహెచ్ఎంసీ కమిషనర్ గా పనిచేశారు. ఆ తర్వాత ఆమె ఏపీకి వెళ్లిపోవడంతో ఆమె స్థానంలో ఇలంబర్తిని గ్రేటర్ కమిషనర్ గా నియమించింది ప్రభుత్వం. జీహెచ్ఎంసీలో రిపోర్టు చేసే కంటే ముందే జార్ఖండ్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ కేటాయించడంతో ఝార్ఖండ్ నుండే నెల రోజులపాటు గ్రేటర్ పరిస్థితిని చక్కబెట్టారు జీహెచ్ఎంసీ కమిషనర్ గా ఉన్న ఇలంబర్తి. 2024 నవంబర్ 14 నుండి పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్న ఇలంబర్తి..కేవలం 5 నెలల్లోనే మళ్లీ ట్రాన్స్ ఫర్ అయ్యారు. ఇప్పుడు ఇలంబర్తి స్థానంలో ప్రభుత్వం ఆర్ వి కర్ణన్ నుజీహెచ్ఎంసీ నూతన బాస్ గా నియమించింది. జీహెచ్ఎంసీపై పట్టు సాధిస్తున్న తరుణంలో ఈ విధంగా 4నెలలోకోసారి కమిషనర్లను మార్చడంతో పాలన గాడి తప్పుతుందన్న వాదనలు గ్రేటర్లో వినిపిస్తున్నాయి. మొదట్లో రోనాల్డ్ రోస్ జిహెచ్ఎంసిపై పట్టు సాధించి అనేక పనులను వేగంగా కంప్లీట్ చేసే తరుణంలోనే ఆయన ట్రాన్స్ ఫర్ కాగా?తాజాగా ఇలంబర్తి కూడా బదిలీ కావడం చూస్తుంటే బల్దియా పాలన ఏడాది కాలంగా మూడు అడుగులు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైందిఇటీవల కాలంలో జిహెచ్ఎంసిలోని అనేక అక్రమాలపై ఫోకస్ చేశారు ఇలంబర్తి. ఉన్నతాధికారులందరూ పనుల్లో ఉండేటట్లు ఆయా విభాగాల్లో ఉన్న లోపాలను గుర్తించి వేగంగా సిటిజన్స్ కు సేవలు అందేలా ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్క విభాగంలోని లోపాలను గుర్తించి వాటిలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణలు కూడా చేయించారు. ఇంజనీరింగ్ విభాగంలో పలు సర్కిళ్లలో పనులు కాకుండానే బిల్లులు చెల్లించారన్న ఆరోపణలపై విచారణ జరిపించారు.అందులో కొన్ని అంశాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన కమిషనర్..చర్యలకు ఉపక్రమించే తరుణంలోనే తాజాగా ట్రాన్స్ ఫర్ అయ్యారు. బర్త్ అండ్ డెత్..మలేరియా విభాగంలో కూడా విజిలెన్స్ ఎంక్వైరీ చేయించి ప్రాథమికంగా కొన్ని చర్యలు తీసుకున్నారు. ఇక పన్నుల వసూళ్లలోనూ..ఫిర్యాదులు అందడంతో వాటిని కూడా పరిష్కరించి వ్యవస్థను గాడిన పెట్టారు ఇలంబర్తి. అందువల్లే ఈ ఏడాది 2వేల,40 కోట్ల రూపాయల ఆస్తి పన్నును వసూలు చేసి రికార్డును క్రియేటర్ చేసింది జీహెచ్ ఎంసీ.రోనాల్డ్ రోస్, అమ్రపాలి?తాజాగా ఇలంబర్తి..జీహెచ్ ఎంసీ కమిషనర్లుగా పాలనపై ఫోకస్ పెట్టి తమదైన ముద్ర వేసే సమయంలోనే వారిని మార్చి వేస్తుండడం కారణంగా బల్దియా పాలన గాడిన పరిస్థితి లేకుండా పోయింది. అయితే ఇలా వరుసగా కమిషనర్లు మారడం వెనుక ప్రజాప్రతినిధుల హస్తం ఉందన్న చర్చ సాగుతోంది.

మరి ఇప్పటివరకు మారిన ముగ్గురు అధికారులు కూడా ముక్కుసూటిగా వ్యవహరిస్తారన్న పేరుంది. జీహెచ్ఎంసి మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు?ఇలా ఎవరు చెప్పినా ఎన్ని ఒత్తిళు చేసినా నిబంధనల ప్రకారమే వీరంతా నడుచుకున్నారు.మేయర్ కార్యాలయంలో పనిచేసే రిటైర్డ్ ఉద్యోగుల ఎక్స్ టెన్షన్ విషయంలోనూ?లిమిట్ కు మించి చేసిన బిల్లుల చెల్లింపుల్లోనూ కమిషనర్లందరూ చాలా స్ట్రిక్ట్ గా వ్యవహరించారని బల్దియాలో టాక్. ఇక ఉద్యోగుల ట్రాన్స్ ఫర్స్ విషయంలోనూ నిబంధనలు పాటించని నిర్మాణాల ఆక్యుపెన్సీవ్ సర్టిఫికెట్ల జారీ చేసే విషయంలోనూ నగర ప్రజా ప్రతినిధుల మాటలు భే ఖాతరు చేశారన్న వాదనలు ఉన్నాయి. మేయర్ కార్యాలయంతో పాటు ప్రజా ప్రతినిధుల విషయంలో కొనసాగిన గ్యాప్ వల్లే కమిషనర్లు మారుతున్నారా అనే అంశానికి బల్దియా ప్రధాన కార్యాలయంలో అవుననే సమాధానం వస్తుందన్న టాక్ విన్పిస్తోంది.అయితే త్వరలోనే జీహెచ్ఎంసీకి ఎన్నికలు జరగబోతున్నాయి. ఇలాంటి సమయంలో ముక్కుసూటిగా ఉండే ఇలంబర్తిని ట్రాన్స్ ఫర్ చేసి.. ఆర్వీ కర్ణన్ ను నూతన కమిషనర్ గా నియమించడం వెనుక ఏదో మర్మం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది.

## జమ్మికుంట తహసిల్దార్ గా సిహెచ్ రాజు బాధ్యతల స్వీకరణ



జమ్మికుంట, మే 1 ( తెలంగాణ నేత్రం)

జమ్మికుంట:జమ్మికుంట మండల తాసిల్దార్ గా పనిచేసిన రమేష్ బాబు సాధారణ బదిలీలో భాగంగా శంకర పట్నం కు బదిలీ కాగా కరీంనగర్ రూరల్ తాసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రాజు జమ్మికుంటకు బదిలీ అయ్యారు. గురువారం తాసిల్దార్ కార్యాలయంలో రాజు బాధ్యతలు స్వీకరించగా సిబ్బంది శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు తమ సమస్యలు ఉన్నట్లయితే నేరుగా కార్యాలయానికి వచ్చి తమను కలిసి సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు.

# సంపద సృష్టికర్తలు ఇంకా పేదరికంలోనే..

**- మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా సామాజిక అవగాహన పెంచుకోవాలి**

**- ఐక్య ఉద్యమాలకు అండగా ఉంటా.. : తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్**

హైదరాబాద్: ప్రపంచం మారుతున్నదనీ, అనేక దేశాల్లో కార్మికులు, రైతులు, ఉద్యోగుల ప్రయోజనాలను కోరే ప్రభుత్వాలు వచ్చాయని జస్టిస్ చంద్ర కుమార్ తెలిపారు. ప్రజల ప్రయోజనాలను కోరే ప్రభుత్వాలను అక్కడి ప్రజలు తెచ్చుకున్నారని చెప్పారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్స్ జేఏసీ చైర్మెన్ కె.ఈశ్వర్ రావు అధ్యక్షతన హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రకుమార్ మాట్లాడుతూ పోరాటం చట్టబద్ధంగా, ఐక్యంగా చేయాలని సూచించారు. సమస్త సంపదలను సృష్టిస్తున్న కార్మికులు, శ్రామికులు, పేదలు ఇంకా పేదలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపద సృష్టికర్తలకు ఆదాయంలో 10 శాతం వస్తుంటే యజమానులు 90శాతం తీసుకుంటున్నారనీ, దీని వల్లే సమాజంలో ఆర్థిక అసమానతలు న్నాయని వివరించారు. విద్య, వైద్యంలో ప్రయివేటీకరణ పెరిగి దోపిడీ పెరిగిందన్నారు. అనేక దేశాల్లో విద్యకు బడ్జెట్‌లో 20 నుంచి 25 శాతం కేటాయిస్తుండగా, మన దేశంలో కేవలం 2.5 శాతం వరకు మాత్రమే కేటాయిస్తున్నారని విమర్శించారు. దీంతో పేదరికం వల్ల చదువు కోలేనీ, చదువు కొనలేని, వైద్యం చేయించుకోలేని దుస్థితి దాపురించిందని తెలిపారు. రాజకీయ




నాయకుల ప్రయివేటు విద్యాలయాలు, వైద్యశా లలు నడిచేందుకు ఉద్దేశపూర్వంగా ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమి కోసం కుట్రలు చేస్తుం టారన్నారు.

ఇదంతా ఉద్దేశపూర్వకంగా చేసేదే కానీ, బడ్జెట్ లేనందువల్ల కాదని తేల్చి చెప్పారు. ధరలు తగ్గించలేనీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరిం చలేని, ఉచిత విద్య, వైద్యం అందివ్వని, రైతు ఆత్మహత్యలను నివారించని, నాన్ పర్ఫార్మెన్స్ అసెట్స్ పేరుతో బడా పెట్టుబడీదారులకు రూ.14 లక్షల కోట్లను మాఫీ చేసి ప్రజల సొమ్మును కొల్లగొట్టిన పాలకులు ఎవరి కోసం పని చేస్తున్నారో అర్థం చేసుకోవాలని కోరారు. ప్రపంచంలో అనేక దేశాల్లో ఉచిత విద్య, వైద్యం అమలవుతుంటే మన దేశంలో ఎందుకు కావడం లేదో తెలుసుకోవాలన్నారు. ఆర్టిజన్ల కన్వర్షన్ కోసం జరిగే చట్టబద్ధ ఐక్యపోరాటానికి తన మద్దతు ఉంటుందని ప్రకటించారు. కె.ఈశ్వర్ రావు మాట్లాడుతూ ఆర్టిజన్స్‌కు కన్వర్షన్ సాధిం చేంత వరకు పోరాటం కొనసాగు తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలో 20 వేల మంది ఆర్టిజన్లుగా పని చేస్తు న్నారనీ, 2017లో 23,667 మంది ఉండగా, కొంత మంది రిటైర్ అయ్యారని, మరికొంత మంది విధి నిర్వహణలో మరణించారన్నారు. ప్రమాదాలను నివారిం చడంలో యాజమాన్యం పూర్తిగా విఫల మైందని విమర్శించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.40 వేల నుంచి రూ.80 వేల వరకు మాత్రమే వస్తుందనీ, 20 నుంచి 25 ఏండ్లు విధులు నిర్వహించిన కార్మికునికి చాలా అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 వేల మంది ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 1998లో విద్యుత్ సంస్థలో ఉన్న కాంట్రాక్ట్ కార్మికులను అబ్జర్స్ చేశారనీ, 2002లో విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ రెగ్యులైజేషన్ కోసం బి.పి.ఎం.ఎస్.నెం 36-37 విడుదల చేశారని తెలిపారు. 2006లో 7,114 సీజేఎల్ఎం పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే, కాంట్రాక్ట్ కార్మికులతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తే రద్దు చేసి, అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మకులతో భర్తీ చేయించారని గుర్తుచేశారు. ఆర్టిజన్లకు ఉన్న విద్యార్హతల మేరకు జేఎల్ఎం, సబ్-ఇంజినీరింగ్, జూనియర్ అసిస్టెంట్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయాలని యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని కోరారు. కన్వర్షన్ సమస్యను పరిష్క రించకుంటే నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు. జిల్లా స్థాయి లో జేఏసీ సమావేశాలు నిర్వహించాలని సమా వేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులతో పాటు జిల్లాల నాయ కులు పలువురు మాట్లాడారు. ఇతర సంఘాల నుంచి వచ్చిన పలువురు నాయకులు జేఏసీ పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ ఎం.ఏ.వజీర్, కో చైర్మెన్ జి.నాగరాజు, కో కన్వీనర్ కందికొండ వెంకటేశ్, జాయింట్ సెక్రెటరీలు ఎస్.చంద్రారెడ్డి, కె.లింగం, పి.మురళీ, కె.రఘు నాథరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు పి.కోటి గౌడ్, సలీం పాషా, మీడియా ఇన్‌ఛార్జి జె.ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

## జూలై 13 నుంచి బోనాలు

హైదరాబాద్: తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా భావించే ఆషాఢమాస బోనాలు జూన్ 26వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. అదే రోజు గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలిబోనం రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పించనున్నారు. జులై 13న సికింద్రాబాద్ మహంకాళి(లష్కర్), అదే నెల 20న లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాల ఉత్సవాలు జరగనున్నాయి.ఈ మేరకు అధికారులు ప్రకటన విడుదల చేశారు.నెలరోజుల పాటు జరగనున్న బోనాల ఉత్సవాలు..జూన్ 26న ప్రారంభం అయ్యి.. జూలై 24 న ముగుస్తాయని దేవదాయ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 26న గోల్కొండ

అమ్మవారికి మొదటి పూజతో ఆషాఢ బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రెండవ పూజ జూన్ 29న, మూడవ పూజ జూలై 3న , నాల్గవ పూజ అదే నెల అనగా జూలై 6న , 5వ పూజ జూలై 10వ తేదీన, 6వ పూజ13న, ఏడవ పూజ17న, ఎనిమిదో పూజ 20వ తేదీన జరగనున్నాయి. చివరగా జూలై 24న 9వ పూజ తరువాత బోనాల ఉత్సవాలు ముగుస్తాయి.బోనాల పండుగ 19వ శతాబ్దంలో అనగా 1813 ప్రాంతంలో హైదరాబాద్ రాష్ట్రంలో ప్రారంభమైందని నమ్ముతారు. ఒక కథనం ప్రకారం, హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఒకసారి తీవ్రమైన ప్లేగు వ్యాధి వ్యాపించింది. అప్పుడు ఉజ్జయినిలో ఉన్న హైదరాబాద్ సైనిక దళం మహాకాళి అమ్మవారిని తమ ప్రజలను కాపాడమని ప్రార్థించింది. ఒకవేళ ప్లేగు తగ్గిపోతే హైదరాబాద్‌లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని మొక్కుకున్నారు. ప్రజల నమ్మకం ప్రకారం, ప్లేగు వ్యాధి తగ్గిపోయింది, ఆ తరువాత సైనికులు తిరిగి వచ్చి వారు ఇచ్చిన మాట ప్రకారం అమ్మవారి విగ్రహాన్ని స్థాపించారు. అప్పటి నుండి బోనాలు జరుపుకోవడం ఒక సంప్రదాయంగా మారింది.

## సింహాచలం ఘటనకు కూటమి బాధ్యతారాహిత్యమే కారణం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మీడియా సమావేశం నిర్వహించారు. సింహాచలంలో నరసింహస్వామివారి నిజరూప దర్శనం జరిగే కార్యక్రమంలో ఈరోజు ఉదయం ఏడుగురు దుర్మరణం చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హిందూ ఆలయాల్లో చేస్తున్న ఘోరాలు, బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్న తీరు అత్యంత దారుణం. ఆలయంలో ఇటీవల చేపట్టి నిర్మాణాల్లో నాణ్యత పూర్తిగా లోపించింది. గతంలో ఉన్న కాంట్రాక్టుల్ని రద్దు చేసి నాయకులకు సంబంధించిన వారికి కాంట్రాక్టులు విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడవుతున్నారు. పచ్చమీడియా వీరికి రక్షణ కవచంలా పనిచేస్తుందని వీరి నమ్మకం. రోజుకో వేషం వేసే సనాతన ధర్మాన్ని కాపాడే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారు. అధికారులు, పోలీస్ యంత్రాంగం ఎవరూ ప్రమాదం జరిగిన ప్రాంతంలో లేరని అక్కడ ఉన్న భక్తులు చెబుతున్నారు. ఇంత నిర్లక్ష్యం ఈ పచ్చ మీడియాకు కనపడదా. ఇటీవల తిరుపతిలో కూడా టికెట్లు ముందు ఇస్తామని భక్తులను ఒక పార్కులో పెట్టి తోపులాటకు కారణమయ్యారు. తిరుపతిలో ఏడుగురు చనిపోతే సనాతన ధర్మవాది అని చెప్పుకునే పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పి చేతులు దులుపుకొన్నారు. శ్రీకూర్మంలో నక్షత్ర తాబేళ్ల వనంలో, అవి చనిపోతే ఎంతో నిర్లక్ష్యంగా కనీసం పోస్టుమార్టం చేయకుండా వాటిని దహనం చేసేశారు. 100 గోవులు చనిపోతే ,ఎంత నిర్లక్ష్యంగా ఇప్పుడు ఏమైంది అని మాట్లాడడం ఎంత దారుణం. ఈ కూటమి ప్రభుత్వానికి ఇవేమీ పట్టించుకోరా. పవన్ కళ్యాణ్ ప్రతిదాన్ని ఒక పంచ్ డైలాగ్ లాగా చెప్పడం తప్ప చేసేదేమీ లేదు. భక్తులు ఆలయాల దగ్గర చనిపోతుంటే ఈ సనాతన ధర్మవాది ఏ ఆలయంలో మెట్లు కడుగుతున్నాడు. ఎలా చనిపోయిన వారి ప్రాణాలను వెనక్కి తీసుకొస్తారో చెప్పాలి. ఈ ప్రభుత్వానికి ఎంతసేపు ఎన్ని వేల కోట్లు అప్పుచేసి తీసుకురావాలో అని తప్ప ప్రజలకు ఎలా న్యాయం చేయాలో ఆలోచన లేదని మండిపడ్డారు.

# ఆర్ ఎస్ ఎస్.. బీజేపీ లు రాహుల్ గాంధీ కుటుంబానికి బద్ధశత్రువులే..

**- కాళేశ్వరం ప్రాజెక్టు లో షార్ట్ కట్ ఇంజనీర్ లు నువ్వు.. మీ మామే కదా..?**

**- దొంగలు మీరే..పోలీసులు మీరే నా..?**

**- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నిప్పులు**

స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఆర్ ఎస్ ఎస్ బీజేపీ పుట్టిన తర్వాత బీజేపీ..ఆనాటి నుండి.. ఈనాటి వరకు రాహుల్ గాంధీ కుటుంబానికి బద్ధశత్రువులే నని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు.గాంధీ భావన లో రాజ్యసభ ఎంపీ అనిల్ యాదవ్ తో కలిసి మెడియా సమావేశ లో మాట్లాడారు.. ఈ మాత్రం పరిజ్ఞానం కూడా లేదా హరీష్ నీకు స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఆర్ ఎస్ ఎస్ బీజేపీ పుట్టిన తర్వాత బీజేపీ..ఆనాటి నుండి.. ఈనాటి వరకు రాహుల్ గాంధీ కుటుంబానికి బద్ధశత్రువులే రేవంత్..మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి లు సొంత కవిత్వం చెప్పడం లేదు ఎన్ డి ఎస్ ఏ రిపోర్ట్ నే చెప్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో షార్ట్ కట్ ఇంజనీర్ లు నువ్వు.. మీ మామే కదా..?దొంగలు మీరే..పోలీసులు మీరే నా..? బీజేపీ తో రాజకీయంగా చాటు మాటు గా సంసారం చేసింది కేసీఆర్ కుటుంబమే కదా..? అన్ అన్నారు.అందుకే గజ్వేల్ సభలో మోడీ ప్రేమ ఉంటే చాలు అన్నది కేసీఆరే కదా..?కేసీఆర్.., హరీష్ రావు లు.. ఇద్దరూ తోపులే కదా.. మెదక్ పార్లమెంట్ లో బీజేపీ ఎలా గెలిచిందితెలంగాణా ఇచ్చే సమయంలో స్పీకర్ గా ఉన్న మీరా కుమార్ కి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేయకుండా...బీజేపీ కి ఓటేసిన మీరా విలువల గురించి మాట్లాడేదిరాహుల్ గాంధీ నే కాదు.. కరెన్సీ మీద గాంధీ బొమ్మ ఎప్పుడు తీయాలా..? అని కుట్ర జరుగుతుందితుమ్మిడి హెట్టీ నుండి గ్రావిటీతో నీళ్లు వచ్చేది వదిలేసి.. లిఫ్ట్ లను పెట్టింది మీరు మీ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి లపై బురద జల్లే ప్రయత్నం చేస్తారా..?తెలంగాణ లో బి ఆర్ ఎస్ అధికారంలోకి రాకున్నా ఫరవాలేదు.. కానీ కాంగ్రెస్ రావద్దని..బీజేపీ నీ ఎత్తేపనిలో ఉన్నారు కేసీఆర్రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ హనుమంతరావు సూచనలు తుంగలో తొక్కింది కేసీఆర్ కాదా..? నకిలీ ప్లానింగ్.. తో తెలంగాణ ప్రజల సొమ్ము వృదా చేసింది మీరే కదా..?మీ తప్పులు ప్రశ్నిస్తే..

సీఎం రేవంత్..ఉత్తం పై నిందలా..?పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్ఎస్ నేతలు అంతా బిజెపికి మద్దతిచ్చారుపోలింగ్ బూతులో టిఆర్ఎస్ ఏజెంట్లు కూడా లేనిది నిజవే కదా..?అని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో 2025, ఫిబ్రవరి 10న తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇసుక విషయంలో చోటు చేసుకుంటున్న అక్రమాలను నిరోధించడానికి అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని సీఎం గారు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2025, ఫిబ్రవరి నుంచి అత్యాధునిక సాంకేతికతను నియోగిస్తున్నాం.

ఈ క్రమంలో ఇసుక రీచుల నుంచి స్టాక్‌యార్డుకు చేరుకునే వాహనాలకు ఉఖూ పరికరాలు, ఇసుక రీచుల వద్ద అఅ కెమెరాలను అమర్చడం జరిగిందన్నారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ ఇసుక తవ్వకాలతోపాటు వేబిల్స్ లేని వాహనాలను నియంత్రించే ఉద్దేశంతో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ సాండ్ బజార్స్ కు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో మార్చి 17న అబ్దుల్లాపుర్‌మెట్ లో, మార్చి 18న బోరంపేట్ లో, మార్చి 19న వట్టినాగులపల్లిలో, ఏప్రిల్ 16న ఆదిబట్లలో సాండ్ బజార్లను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కొన్ని రవాణా సంస్థలు, మరికొన్ని పత్రికలు ప్రభుత్వం నిర్ణయించిన సన్న ఇసుక ధర రూ.1800, దొడ్డు ఇసుక ధర రూ.1600 చాలా ఎక్కువ అని తప్పుడు ప్రచారం చేశాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు ఫలితంగా బహిరంగ మార్కెట్లో ఒక వారంలోనే సన్న ఇసుక ధర రూ.1900 ? 1800, దొడ్డు ఇసుక ధర రూ.1700 ? 1600 వరకు దిగి వచ్చింది.? గతంలో బహిరంగ మార్కెట్లో టన్ను ఇసుక ధర రూ.2400-2200 మధ్య ఉండేది. కానీ సామాన్య ప్రజలకు కూడా ఇసుక ధర అందుబాటులో ఉండాలనే ముఖ్యమంత్రి గారి సంకల్పానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడంతో ఇప్పుడు ఇసుక ధర రూ.1700-1600కు దిగొచ్చింది.?ముఖ్యమంత్రి గారు సాండ్ బజార్స్, స్టాక్‌యార్డ్స్ నుంచి ప్రజలకు ఇంటి వద్దకే ఇసుకను చేర్చే ఒక వ్యవస్థను కూడా రూపొందిం చాలని ఆదేశించారు. దానికి అనుగుణంగా తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ ఆన్‌లైన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసింది.

ఈ వ్యవస్థ ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు ఇసుకను హోమ్ డెలివరీ చేయడం జరుగుతుంది. ? ఈ విధానంలో వినియోగదారుడు తాను ఎంపిక చేసిన ఇసుక రీచు నుంచి ఇసుక ధర రూ.400తోపాటు ప్రతి టన్ను, ప్రతి కిలోమీటరుకు నిర్ణయించిన మేరకు రవాణా ఛార్జీలు చెల్లించాలి.

ఇందుకోసం 1600 వాహనాలను సిద్ధం ఉంటాయి. 200 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటే ప్రతి కిలోమీటర్ కు రూ.3.75 చొప్పున, 200 కిమీ కంటే తక్కువ దూరం ఉంటే ప్రతి కిలోమీటర్ కు రూ.4.25 చొప్పున ఛార్జీలు వసూలు చేస్తారని తెలిపారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఆస్తి పన్ను 5% రిబేట్ లో జమ్మికుంట ప్రథమ స్థానం..

### పలువురి ప్రశంసలు.. మూడు కోట్ల నిధులు మంజూరు...




జమ్మికుంట: మే 1( తెలంగాణ నేత్రం)

జమ్మికుంట : తెలంగాణ రాష్ట్రం ప్రతి సంవత్సరం మాదిరిగా ఏప్రిల్ నెలలో 5 శాతం రిబేట్ కేటాయించడం జరిగిందని, అందులో భాగంగా 13 కార్పొరేషన్ లతో కలుపుకొని, 151 మున్సిపాలిటీలలో జమ్మికుంట మున్సిపాలిటీ 55.04 శాతంతో మొదటి స్థానంలో నిలిచినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రజా ప్రతినిధులు, ప్రజలు స్వయంగా కొంత మంది బిల్ కలెక్టర్ లకు, వార్డు ఆఫీసర్ లకు ఫోన్ చేసి ఆస్తి పన్ను చెల్లించడంలో మక్కువ చూపడం, మన జమ్మికుంట మున్సిపాలిటీ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని తెలుసుకొని ఆస్తి పన్ను చెల్లించడం హర్షణీయమన్నారు. తెలంగాణలో సైతం ఆస్తి పన్ను మొదటి సరిగా 55.04 శాతంతో మొదటి స్థానంలో నిలవడం జరిగిందన్నారు. గతంలో ఆస్తి పన్ను వసూళ్లలో సైతం మొదటి స్థానంలో నిలవడం జరిగిందని, ఇప్పుడు 5% రిబేట్ లో ఆర్ ఐ, ఆర్ ఓ, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ప్రజలకు ఆస్తి పన్ను వసూళ్లపై వ్యక్తిగతంగా కలిసి వారికి పన్నులు చెల్లించడంలో లాభాలు వారికి క్లుప్తంగా వివరించి, ఆస్తి పన్ను వసూలు చేశారని ఆయన అన్నారు. ఆస్తి పన్ను వసూళ్లలో మొదటి స్థానం సాధించడం పట్ల సీ.డి.ఏం.ఎ. పలువురు ఫోన్ లో అభిందించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు గాను నేడు జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధికై మూడు కోట్ల రూపాయల నిధుల ప్రొసీడింగ్ కాపీని అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇంత గొప్ప స్థానాన్ని అధిరోహించడానికి సహకరించిన, మాజీ ప్రజా ప్రతినిధులకు, మీడియా మిత్రులకు, పట్టణ ప్రజలకు, వర్తక, వ్యాపారస్థులకు, మున్సిపల్ ఆర్.ఐ., ఆర్.ఓ., అధికారులకు, వార్డు ఆఫీసర్లకు, బిల్ కలెక్టర్లకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఆర్.ఐ. భాస్కర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో ఘనంగా "మేడే" వేడుకలు....

### ఎర్రజెండా లతో భారీ ర్యాలీ తీసిన కార్మికులు...
### కార్మిక, కర్షకుల సంక్షేమమే నాకు ముఖ్యం....
### కే డి సి సి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్.....




జమ్మికుంట, మే 1 ( తెలంగాణ నేత్రం)

జమ్మికుంట:మే డే ను పురస్కరించుకొని జమ్మికుంట పట్టణంలో సుమారు 300 మంది కార్మికులు ఎర్రజెండాలను చేత పట్టుకుని భారీ ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ హమాలి వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడి నుండి భారీ ర్యాలీతో బయలుదేరి గాంధీ చౌరస్తా మీదుగా పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ దగ్గర గల అమాలి వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం కార్మికుల నినాదాలు మధ్య జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా హమాలి వర్కర్స్ యూనియన్ కోసం పనిచేశామని కార్మికుల సంక్షేమమే తన లక్ష్యమని ప్రజాక్షేత్రంలో ఉన్నన్ని రోజులు అటు రైతుల పక్షాన ఇటు కార్మికుల పక్షాన పోరాటం చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కష్టాన్ని నమ్ముకుని బ్రతికే మనిషి కార్మికుడని అలాంటి కార్మికుడికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కార్మికుల సమస్యల పోరాటమే ఎజెండాగా కార్మికులు పోరాటం చేయాలని ఆయన సూచించారు. దేశంలో సుమారు 47 కోట్ల మంది శ్రమజీవులు ఉండగా కేవలం ఏడు కోట్ల మంది మాత్రమే ఉద్యోగ భద్రత తగిన వేతనాలతో జీవిస్తున్నారని మిగతావారు బతుకు భద్రత లేక కొట్టుమిట్టాడుతున్నారని రమేష్ తెలిపారు. రాజ్యాంగం భద్రతల గురించి గొప్పలు చెప్పే నాయకులు పాలకులు ఎందుకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదో తెలపాలని అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును ఎందుకు అమలు చేయడం లేదో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంతోమంది పోరాటాల త్యాగ ఫలితమే ఈ మేడే అని శ్రామిక వర్గం జీవించడానికి సరిపడే వేతనాల కొరకై పోరాడాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాల%శ్రీశీ% 15 చట్టాలను అడ్రస్ లేకుండా చేసిందని మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోర్సుగా ఆమోదించి అమలు చేయడం వల్ల ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలలో పనిచేసే కార్మికులు ఉద్యోగులు కట్టు బానిసరిగా మారబోతున్నారని ఈ సందర్భంగా అన్నారు. అనంతరం కార్మిక నాయకుడు సామ్రాజ్యం మాట్లాడుతూ, ప్రజాసేవ పేరుతో ఎన్నికైన ఎమ్మెల్యే ఎంపీలకు అధిక జీతాలు సదుపాయాలు పెంచే విషయంలో ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ నిరంతరం తన కష్టాన్ని నమ్ముకుని చెమటను వడుస్తూ పని చేస్తున్న కార్మికులపై లేదని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో కార్మికుల కు రావలసిన న్యాయమైన డిమాండ్ల కొరకు పోరాటాలు కొనసాగిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జమ్మికుంట హమాలి సంఘం అధ్యక్షులు రాజేశ్వరరావు తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు కార్మికులు మహిళలు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చికాగో అమరవీరుల స్ఫూర్తితో పోరాడుదాం

### సిపిఎం మండల కార్యదర్శి శీలం అశోక్



జమ్మికుంట: మే 1( తెలంగాణ నేత్రం)

జమ్మికుంట:జమ్మికుంట సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో 139 వా మే డే సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించుకోవడం జరిగింది . ఈ సందర్భంగా శీలం అశోక్ మాట్లాడుతూ...

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నినాదంతో 1886 లో చికాగో నగరంలో కార్మికులందరూ 8 గంటల పని దినాలు కావాలని ఉద్యమం చేస్తుంటే హే మార్కెట్లో కార్మికుల పై అమెరికా ప్రభుత్వం కాల్పులు జరపడం మూలాన కొంతమంది కార్మికులు చనిపోవడం జరిగింది అదే స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా కార్మికులందరూ కూడా ఎనిమిది గంటల పని దినాలు కావాలని 1886 నుండి 1890 మే 1 న అమలు కావడం జరిగింది అందుకే మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటారని అన్నారు చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాడాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేంతవరకు కార్మికులందరూ కలిసి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు గతంలో రైతు నల్ల చట్టాలను తీసుకువచ్చి బిజెపి ప్రభుత్వం రైతులను దగా చేస్తుంటే రైతులందరూ కలిసి సంవత్సరం పాటు ఢిల్లీ నడిబొడ్డున పోరాడి 750 పైచిలుకు రైతులు మరణించిన తర్వాత ఆ నల్ల చట్టాలను రద్దు చేయడం జరిగింది . బ్రిటిష్ వాళ్ళు అప్పుడు పన్నుల రూపంలో కార్మికులను రైతులను ప్రజలను దోచుకుంటూ నేడు బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేబర్ కోడులను తీసుకొచ్చి కార్మికుల పొట్ట కొడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు స్వాతంత్రం సిద్ధించి 8 దశాబ్దాల కాలం కావస్తున్న కార్మికులకు కనీస వేతనం అట్లాగే రైతులకు గిట్టుబాటు ధర చెల్లించకపోవడం సిగ్గుచేటు అన్నారు జూన్ 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని ప్రజలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జక్కుల రమేష్ యాదవ్, దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్ కుమార్, కన్నం సదానందం, సల్ల కుమారు, నాయకులు గిరవెని రాజు, మదనయ్య, కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాలతో అగ్గి రవ్వలు పుట్టించిన ప్రజాకవి శ్రీ శ్రీ

### - టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు



ముషీరాబాద్: అక్షరాలతో అగ్గి రవ్వలు పుట్టించి.. చందస్సు సంకెళ్లను తెంచిన ప్రజాకవి శ్రీశ్రీ అని టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రముఖ కవి శ్రీశ్రీ 115వ జయంతి సందర్భంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే హాల్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ చిత్రపటాలను చేబూని శ్రీ శ్రీ కవిత్వం వర్ధిల్లాలి అంటూ యువత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీశ్రీ మాట పీడిత పక్షం.. ఆయన బాట ప్రజా మార్గం.. ఆయన ఒక నిప్పు %-% అక్షరాల అగ్ని కణికలు.. అతడొక సాహిత్య సముద్రం.. ఆయన ఒక తరాన్నే ప్రభావితం చేసిన యుగ స్వరం విప్లవ నాదం, మహోగ్రనాదం అని కవితీ్వకరించారు. 20వ శతాబ్దపు తొలి, చివరి అక్షరం కూడా అతనేనని చెప్పొచ్చన్నారు. ఈ ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపినవాడు శ్రీశ్రీ అని కొనియాడారు. అప్పటివరకు సమాజంలో ఉన్న దోపిడీ సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయంగా ముందుకు తెచ్చిన సిద్ధాంతం కమ్యూనిజం అని అన్నారు. దాని సిద్ధాంతపు లోతులను సులభతరం చేసి దేశచరిత్రల పేరుతో అక్షరాన్ని ఆయుధం చేసి అందించిన లోక కవి, ఏకైక ప్రజాకవి అని తెలిపారు. సమసమాజ సామ్యవాద భావాజాలాన్ని తన కవిత్వంలో ఎత్తి పట్టారని, కొత్త నడక, సరికొత్త ఆలోచనలతో తిరోగమన సాహిత్యాన్ని భూమార్గం పట్టించారని చెప్పారు. సామాన్యుడి చుట్టూ ఆయన సాహిత్యం తిరిగిందని, సినీ గీతాల ద్వారా కూడా సామాన్యులకు దగ్గరైనారని, అందుకే శ్రీశ్రీ యుగకవి అయ్యార న్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లల బాలకష్ణ, టీపీఎస్‌కే హైదరాబాద్ సెంట్రల్ సిటీ కన్వీనర్ జి.నరేష్, నాయకులు విజరు కుమార్, రాజయ్య గౌడ్, యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో సెయింట్ జోసెఫ్ విద్యార్థుల ప్రభంజనం.








జమ్మికుంట: మే 1( తెలంగాణ నేత్రం)

జమ్మికుంట :, , బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో సెయింట్ జోసెఫ్ విద్యార్థులు 100% రిజల్ట్ తో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం జరిగింది. సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు 560/600 మార్కులతో గంగారపు జెస్సికా ప్రథమ స్థానం సాధించడం జరిగిందని,552/600 నాగల వైష్ణవి ద్వితీయ,540/600 దొడ్డే దేవిక తృతీయ స్థానాలతో వారి ప్రతిభ కనబరచడం జరిగింది, ఇలా535/600 జంగిలి నవ్య శ్రీ, 534/600 అప్పల విష్ణువర్ధన్, 530/600 రాపెల్లి హిమాని, 529/600 మార్క అనన్య, 525/600 మూదం ఇందు, 516/600 దొంకటి వైష్ణవి, 509/600 బండి స్నేహ, 507/600 దొడ్డే క్షేత్ర, 506/600 ఉప్పు సౌమ్య, 501/600 బొనగాని రామ్ చరణ్, 500/600 మైసా స్నిగ్ధ ఇలా ఎన్నో ర్యాంకులతో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, 100% ఉత్తీర్ణతతో ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వై సునీల్ కుమార్ మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణతో ముందు ఉండడంచాలా ఆనందంగా ఉందని స్కూల్ ఉపాధ్యాయ బృందం సమిష్టితో ఒక క్రమబద్ధమైనటువంటి ప్రణాళికతో ఉదయము,సాయంత్రము స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులకు పాఠంశాలు బోధించడం జరిగిందని అలాగే విద్యార్థులందరూ కూడా చాలా చక్కగా విద్యను అభ్యసించి ఈ విజయాన్ని సాధించడం జరిగిందని వారన్నారు, స్కూల్ నుండి ప్రథమ, ద్వితీయ ,తృతీయ స్థానం పొందినటువంటి విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించడం జరిగింది, సెయింట్ జోసెఫ్ స్కూల్ 100% ఉత్తీర్ణత సాధించినందుకు చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు, ప్రథమ స్థానం 560 మార్కులు సాధించిన జి జెస్సిక, ద్వితీయ స్థానం 552 మార్కులు సాధించిన ఎన్ వైష్ణవి, తృతీయ స్థానం 540 మార్కులు డి దేవిక సాధించిన వీరందరినీ కరస్పాండెంట్ వై సునీల్ కుమార్, ప్రిన్సిపల్ వేణుగోపాలశర్మ, ఉపాధ్యాయ బృందం అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ కరస్పాండెంట్ వై సునీల్ కుమార్,ప్రిన్సిపల్ జె వేణుగోపాల శర్మ,స్కూల్ ఇన్చార్జి బుడిడ జాన్, ఉపాధ్యాయులు పీ సంపత్, మహమ్మద్ కరీం, జి గణపతి రెడ్డి, డి రాధిక ,శివకుమార్,డి శ్రీనివాస్,ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మార్కండేయ స్వామి విగ్రహాల ఊరేగింపు

### -మహిళల కోలాటం ఇంటింటికి మంగళహారతులు.
### - కన్నుల పండుగ ఉత్సవాలు



రాయపోల్ : రాయపోల్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భక్త మార్కండేయ స్వామి ఉత్సవాలు సోమవారం వైభవంగా కొనసాగాయి. ఇందులో భాగంగానే మార్కండేయ స్వామి ఆలయం నుంచి విగ్రహాల ఊరేగింపు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాల ఊరేగింపు ముందుకు కొనసాగింది. భారీ సంఖ్యలో మహిళల కోలాటం, యువకుల భక్తి ప్రావస్యం, ఇంటింటికి మంగళ హారతులు ఇవ్వడంతో విగ్రహాల ఊరేగింపు కన్నుల పండుగగా కొనసాగింది. ఉదయం ఆలయం నుంచి విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఊరేగింపును ప్రారంభించారు. గ్రామ పురవీధుల్లో ప్రతి ఇంటి నుంచి మంగళ హారతి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పద్మశాలి సంఘం కులస్తులు కూడా ఇంటింటా మంగళారతులు అందించి ముక్కులు చెల్లించుకోవడంతో శ్రీ భక్త మార్కండేయ విగ్రహాల ఊరేగింపు గ్రామస్తులు, భక్తులు, పద్మశాలి సంఘం సభ్యులు ముందుకు సాగుతూ ఊరేగింపు కొనసాగింది. మార్కండేయ స్వామి ఉత్సవాల్లో మొదటిరోజు ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో భక్తుల దర్శన భాగ్యం కోసం స్వామివారి మొక్కులు చెల్లించుకోవడానికి ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మంగళవారం,బుధవారం ప్రతిష్ట ఉత్సవాలు కొనసాగ నున్నాయి. కాగా మార్కండేయ స్వామి ప్రతిష్ట ఉత్సవాలకు హాజరవు తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా బుధవారం భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ట ఉండడంతో గ్రామ పద్మశాలి సంఘం కుటుంబ సభ్యులు వారి బంధువులు,భక్తులు ఇప్పటికే గ్రామానికి చేరుకోవడంతో రాయపోల్ మండల కేంద్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# తెలంగాణ ఇంటర్ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల..

హైదరాబాద్ : తెలంగాణ 10వ తరగతి పరీక్షల ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల కోసం ఇంటర్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025-26 సంవత్సరానికి అకాడమిక్ షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు కాలేజీల్లో మే 1 నుంచి మే 31 తారీకు వరకు కాలేజీల్లో దరఖాస్తులు చేసుకునేందుకు తెలంగాణ ఇంటర్ బోర్డు అవకాశం కల్పిస్తోంది. ఇంటర్మీడియట్ అడ్మిషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది. ప్రతి కాలేజీలో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీలకు 29శాతం, దివ్యాంగులకు 5శాతం స్పోర్ట్స్ కోట కింద 5శాతం, ఎక్స్ ఆర్మీ, డిఫెన్స్ పిల్లలకు 3శాతం, ఈడబ్ల్యూసీ కోట కింద 10శాతం సీట్లు కేటాయించాలని ఆదేశించింది. ఇంటర్మీడియట్ లో విద్యార్థుల అడ్మిషన్ కోసం ఎలాంటి పరీక్షలు నిర్వహించవద్దని కాలేజీలను ఇంటర్ బోర్డు ఆదేశించింది. టెన్త్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ కల్పించాలని సూచించింది. అంతేకాదు.. అనుమతి ఉన్న మేరకే సెక్షన్స్ నిర్వహించాలని, ఒక్క సెక్షన్‌లో 88 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించాలని పేర్కొంది.

# ఈ నెలలో చుక్కలు చూపించనున్న ఉష్ణోగ్రతలు!

### హెచ్చరించిన భారత వాతావరణ శాఖ
### సాధారణం కంటే ఎక్కువ రోజులపాటు వడగాలులు
### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

మే నెలలో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. మేలో సాధారణంగా నాలుగు రోజులపాటు వీచే వడగాలులు ఈసారి వారం పాటు ఉంటాయని పేర్కొంది.

గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి ఉంటాయని వెల్లడించింది. అయితే, సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైతే గత ఏడాది లాంటి తీవ్ర వేడి పరిస్థితుల నుంచి తప్పించుకోవచ్చని పేర్కొంది.

మే నెలలో వడగాలులు నాలుగు రోజులు అధికంగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. ముఖ్యంగా రాజస్థాన్, హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఝార?ండ్, పశ్చిమ బెంగాల్‌లోని గంగానది పరీవాహక ప్రాంతంలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వివరించారు. అలాగే, గుజరాత్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణకు ఆనుకుని ఉన్న ప్రాంతాలు, ఉత్తర కర్ణాటక రాష్ట్రాలు కూడా సాధారణం కంటే ఎక్కువ రోజులపాటు వడగాలులను ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సాధారణంగా మే నెలలో దేశంలోని దక్షిణ, పడమర తీర ప్రాంతాలను మినహాయించి మిగతా ప్రాంతాల్లో ఒకటి నుంచి మూడు రోజుల వరకే వడగాలులు నమోదవుతుంటాయి.

# బిసిసిఐకి భారీ ఎదురుదెబ్బ..
## ఢిల్లీ హైకోర్టు నోటీసులు

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ)కి తాజాగా ఊహించని షాక్ తగిలింది. బోర్డు తీసుకున్న ఓ నిర్ణయం ఇప్పుడు సరికొత్త వివాదానికి తెరలేపింది. బిసిసిఐ ఐపిఎల్‌లో ఎప్పటికప్పుడు సరికొత్త ప్రమోగాలు చేస్తుటుంది. తొలుత అంపైర్ క్యామ్, ఆ తర్వాత స్పైడర్ క్యామ్.. ఈ ఏడాది రోబో కుక్కను ప్రవేశపెట్టింది. ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ రోబో కుక్కను ప్రవేశపెట్టారు. అయితే ఈ కుక్కకు నామకరణం చేసే పనిని ఓటింగ్ పద్దతిలో చేయాలని ప్రేక్షకులను కోరారు. అయితే చాలా మంది ఆ కుక్కకు చంపక్ అనే పేరుకు ఓటు వేయగా%% ఏప్రిల్ 20వ తేదీన ఆ పేరునే నామకరణం చేశారు. ఇప్పుడు ఇదే వ్యవహారంతో బిసిసిఐ చిక్కుల్లో పడింది. ఢిల్లీ ప్రెస్ పత్రా ప్రకాశన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 1968 నుంచి తమ సంస్థ చంపక్ అనే పేరుతో పిల్లల కోసం మ్యాగజీన్ ప్రచురిస్తున్నామని తమ అనుమతి లేకుండా తమ ట్రేడ్ మార్క్ పేరును వాడుకున్నారని కోర్టుకు తెలిపింది.




దీంతో ఢిల్లీ హైకోర్టు ఈ పిటిషన్‌పై విచారణ జరిపి.. బిసిసిఐకి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానంతో తమ ముందుకు రావాలని బోర్డును ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 9కి వాయిదా వేసింది.

# పంజాబ్ కింగ్స్‌కు షాక్.. కీలక ఆటగాడు దూరం!

జైపూర్: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బుధవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ గెలిచిన ఆనందంలో ఉన్న పంజాబ్ ఫ్యాన్స్‌కి ఊహించని షాక్ తగిలింది. జట్టులో కీలక ఆటగాడు గ్లెన్ మ్యాక్‌వెల్ గాయం కారణంగా జట్టుకు దూరం అయ్యాడు. మ్యాక్‌వెల్ చేతివేలు విరిగింది.

అయితే ఈ సీజన్‌లో మ్యాక్స్‌వెల్ పెద్దగా ఫామ్‌లో లేడు. 7 మ్యాచులు ఆడిన అతను కేవలం 48 పరుగులు మాత్రమే చేశాడు.

మ్యాక్స్‌వెల్‌కి తగిలిన గాయం చిన్నదే అని ముందు అనుకున్నామని.. తర్వాత పేటద్ద సమస్య అని అర్థం చేసుకున్నామని మార్కస్ స్టోయినిస్ అన్నాడు. వేలు విరిగినట్లు స్కానింగ్‌లో తేలిందని.. దీంతో అతను మిగితా టోర్నమెంట్‌కి దూరమయ్యే అవకాశం ఉందని ఆయన



అన్నాడు. మ్యాక్స్‌వెల్ స్థానంలో ఎవరిని జట్టులోకి తీసుకోవాలని ఆలోచిస్తున్నామని ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ పేర్కొన్నారు..

# ముంబైకి ఎదురుందా?

నేడు రాజస్థాన్‌తో పోరు

జైపూర్: వరుస విజయాలతో జోరుమీదున్న ముంబై ఇండియన్స్ గురువారం జరిగే పోరులో రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. ముంబై వరుసగా ఐదు మ్యాచుల్లో గెలిచి దూకుడు మీద ఉంది. రాజస్థాన్‌పై కూడా ఇదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో పోరుకు సిద్ధమైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా ఉన్న ముంబై ఆరో విజయంపై కన్నేసింది. ఇక గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కిందటి మ్యాచ్‌లో చిరస్మరణీయ విజయం అందుకున్న రాజస్థాన్ రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది.

చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ గుజరాత్ జరిగిన మ్యాచ్‌లో కళ్లు చెదిరే శతకం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కూడా అందరి కళ్లు వైభవ్‌పైనే నిలిచాయి. మరో యువ సంచలనం యశస్వ జైస్వాల్‌తో కలిసి శుభారంభం అందించాలనే లక్షంతో సూర్యవంశీ ఉన్నాడు. గుజరాత్‌పై గెలుపు రాజస్థాన్ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇరు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో పోరు ఆసక్తికరంగా సాగడం ఖాయం.

రోహిత్ జోరు సాగాలి..

అద్భుత బ్యాటింగ్‌తో ముంబై విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. రోహిత్ కీలక ఇన్నింగ్స్‌లతో ముంబైకి అండగా నిలుస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో కూడా అతని మెరుగైన బ్యాటింగ్‌ను జట్టు ఆశిస్తోంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన రోహిత్ చెలరేగితే ముంబైకి ఎదురే ఉండదు. రికెల్టన్ కూడా రోహిత్‌కు అండగా నిలుస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో వీరు మరోసారి జట్టుకు శుభారంభం అందించాలనే పట్టుదలతో ఉన్నారు. విల్ జాక్స్ కూడా మెరుగైన



బ్యాటింగ్‌తో అలరిస్తున్నాడు.

ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ నిలకడగా ఆడుతూ జట్టును ఆదుకుంటున్నాడు. ఈసారి కూడా అతని నుంచి ఇలాంటి ప్రదర్శనే జట్టు కోరుకుంటుంది. సూర్యకుమార్ యాదవ్ కూడా జోరుమీదున్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన సూర్య చెలరేగితే ముంబైకి మరోసారి భారీ స్కోరు ఖాయం. తిలక్ వర్మ, కెప్టెన్ హార్దిక్ పాండ్య, నమన్ ధిర్ తదితరులతో ముంబై బ్యాటింగ్ బలంగా ఉంది.

అంతేగాక బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, కర్ణ్ శర్మ, సాంట్నర్ వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు ఉండనే ఉన్నారు. దీంతో ఈ మ్యాచ్‌లో ముంబై ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. మరోవైపు రాజస్థాన్ కూడా విజయమే లక్షంగా పెట్టుకుంది. సూర్యవంశీ, యశస్విలు మరోసారి శుభారంభం అందించేందుకు సిద్ధమయ్యారు. కెప్టెన్ రియాన్ పరాగ్ కూడా జోరుమీదున్నాడు. హెట్‌మెయిర్, హసరంగ, ధ్రువ్ జురెల్, ఆర్చర్‌లతో రాజస్థాన్ పటిష్టంగా కనిపిస్తోంది.

# ముంబయి ఇండియన్స్ తో రాజస్థాన్ రాయల్స్ ఢీ...
## అందరి దృష్టి అతడిపైనే!

**ఐపీఎల్ లో నేడు ఆసక్తికర మ్యాచ్**


**ముంబయి ఇండియన్స్ పై టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్**

**సొంతగడ్డపై టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆతిథ్య జట్టు**

**జైపూర్ లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో మ్యాచ్**

**సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా వైభవ్ సూర్యవంశి**

ఐపీఎల్ లో ఒకే ఒక్క ఇన్నింగ్స్ తో 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశి స్టార్ అయిపోయాడు. ఈ లీగ్ లో తన మూడో మ్యాచ్ లోనే 35 బంతుల్లో 100 పరుగులు చేసి రికార్డుల మోత మోగించాడీ బీహార్ బాలుడు. ఐపీఎల్ లో వైభవ్ సూర్యవంశి రాజస్థాన్ రాయల్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇవాళ రాజస్థాన్ జట్టు ముంబయి ఇండియన్స్ జట్టుతో తలపడుతోంది. ఈ మ్యాచ్ లో అందరి దృష్టి చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశిపైనే ఉంటుందనడంలో సందేహం లేదు. అయితే, ముంబయిలో ఇండియన్స్ జట్టులో జస్ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, హార్దిక్ పాండ్యా వంటి హేమాహేమీ బౌలర్లను ఎదుర్కొని అతడు ఎంతమేరకు రాణించగలడన్నది సర్వత్రా ఆసక్తి కలిగిస్తోంది.మ్యాచ్ విషయానికొస్తే... జైపూర్ లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో జరుగుతోంది. సొంతగడ్డపై టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ బౌలింగ్




ఎంచుకుంది. లీగ్ లో ప్లేఆఫ్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే రాజస్థాన్ రాయల్స్ కు ఈ మ్యాచ్ లో నెగ్గడం తప్పనిసరి. ఈ మ్యాచ్ కోసం రాజస్థాన్ టీమ్ లో రెండు మార్పులు చేశారు. హసరంగ స్థానంలో కుమార్ కార్తికేయ... సందీప్ శర్మ స్థానంలో మధ్వాల్ తుదిజట్టుకు ఎంపికయ్యారు. అటు, ముంబయి ఇండియన్స్ టీమ్ లో ఎలాంటి మార్పులు లేవని కెప్టెన్ హార్దిక్ పాండ్యా వెల్లడించాడు. పాయింట్ల పట్టిక చూస్తే... ముంబయి ఇండియన్స్ 10 మ్యాచ్ లు ఆడి 6 విజయాలతో మూడో స్థానంలో కొనసాగుతోంది. రాజస్థాన్ రాయల్స్ 10 మ్యాచ్ లు ఆడి కేవలం 3 విజయాలు మాత్రమే సాధించి ఎనిమిదో స్థానంలో ఉంది.

# ధోనీ వంటి ప్రమాదకర బ్యాటర్ ఉన్నాడని
## తెలుసు: హ్యాట్రిక్‌పై చాహల్

ఐపీఎల్‌లో హ్యాట్రిక్ సాధన వెనుక వ్యూహాన్ని వివరించిన చాహల్

పేసర్ల స్లో బంతులు, పిచ్ స్వభావాన్ని గమనించి లైన్ మార్చుకున్నానని వెల్లడి

హ్యాట్రిక్ గురించి కాకుండా, ఉత్తమ బంతి వేయడానికే ప్రయత్నించానని స్పష్టం

ధోనీ, దూబే క్రీజులో ఉన్నా వికెట్ తీయడమే లక్ష్యంగా పెట్టుకున్నానని వ్యాఖ్య

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో మాట్లాడుతూ ఈ విషయాలు పంచుకున్న చాహల్

ఐపీఎల్‌లో హ్యాట్రిక్ సాధించడం ఏ బౌలర్‌కైనా ఒక మరుపురాని అనుభూతి. అలాంటి అరుదైన ఘనతను అందుకున్న పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, తాను హ్యాట్రిక్ సాధించిన మ్యాచ్‌లో తన బౌలింగ్ వ్యూహాన్ని ఎలా అమలు చేశాడో ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. పేస్ బౌలర్లు వేసిన నెమ్మదైన బంతులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తన బౌలింగ్ వ్యూహంలో మార్పులు చేసుకున్నానని తెలిపాడు.

ఐపీఎల్ అధికారిక వెబ్‌సైట్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో మాట్లాడుతూ చాహల్ ఈ విషయాలు పంచుకున్నాడు. "సాధారణంగా నాకు 19వ లేదా 20వ ఓవర్ వేసే అవకాశం వస్తుందని ముందే ఊహించాను. దానికి తగ్గట్టుగా మానసికంగా సంసిద్ధమయ్యాను. అంతకుముందు పేసర్లు వేసిన స్లో బంతులను నిశితంగా గమనించాను. ఆ బంతులు పిచ్‌పై పడిన తర్వాత బ్యాట్‌పైకి సరిగా రావడం లేదని, కాస్త ఆలస్యంగా వస్తున్నాయని గ్రహించాను. అది చూశాక, నేను ఏ ప్రాంతంలో బంతులు వేయాలో ఒక స్పష్టత వచ్చింది" అని చాహల్ వివరించాడు.

హ్యాట్రిక్ గురించి తాను ముందుగా ఆలోచించలేదని, తన అత్యుత్తమ




ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి సారించానని చాహల్ పేర్కొన్నాడు. "నిజం చెప్పాలంటే, హ్యాట్రిక్ గురించి నేను ఏమాత్రం ఆలోచించలేదు. నా శాయశక్తులా బౌలింగ్ చేయడానికే ప్రయత్నించాను. అప్పటికే క్రీజులో ధోనీ, మరో ఎండ్‌లో శివమ్ దూబే వంటి ప్రమాదకర బ్యాటర్లు ఉన్నారని నాకు తెలుసు. అయినప్పటికీ, నా ఓవర్లో ఎలాగైనా వికెట్ సాధించాలనే పట్టుదలతో బౌలింగ్ చేశాను" అని తెలిపాడు.

ప్రత్యర్థి బ్యాటర్లు తన బౌలింగ్‌లో సిక్సర్లు కొడతారేమోనన్న భయం తనకు లేదని, తన ప్రణాళికను కచ్చితంగా అమలు చేయడంపైనే దృష్టి పెట్టానని చాహల్ స్పష్టం చేశాడు. "వాళ్లు నా బంతులకు సిక్సర్లు కొడతారా అని నేను పెద్దగా పట్టించుకోలేదు. నా వంతుగా అత్యుత్తమ బంతిని సంధించాలని మాత్రమే అనుకున్నాను. ఆ ప్రణాళిక విజయవంతమైంది" అని చాహల్ ముగించాడు.

# రాజస్థాన్ రాయల్స్ 'పింక్ ప్రామిస్'..
## ప్రతి సిక్సర్‌కు ఆరు ఇళ్లలో వెలుగులు

**ఈరోజు జైపూర్ వేదికగా ఆర్ఆర్, ఎంఐ మ్యాచ్**

**ఈ మ్యాచ్‌కు ముందు రాజస్థాన్ జట్టు సరికొత్త ఆలోచన**

**పేదల ఇళ్లలో వెలుగులు నింపేందుకు బృహత్తర నిర్ణయం**

తమ జట్టు ఆటగాళ్లు కొట్టే ప్రతి సిక్సర్‌కు రాష్ట్రంలోని ఆరు ఇళ్లలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు

ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) సరికొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. పేదల ఇళ్లలో వెలుగులు నింపనుంది. ఈరోజు ముంబయి ఇండియన్స్ (ఎంఐ)తో సొంతమైదానం జైపూర్ లోని సవాయి మాన్‌సింగ్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో తమ జట్టు ఆటగాళ్లు కొట్టే ప్రతి సిక్సర్‌కు ఆ రాష్ట్రంలోని ఆరు ఇళ్లలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా రాజస్థాన్ జట్టు ప్రకటించింది.

"ఈరోజు మ్యాచ్ చాలా ప్రత్యేకం... ఇది మా పింక్ ప్రామిస్ గేమ్" అని ఆర్ఆర్ ట్వీట్ చేసింది. దీంతో రాజస్థాన్ ఫ్రాంచైజీ నిర్ణయాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.




ఇక, ఇప్పటివరకు ఈ సీజన్‌లో 10 మ్యాచ్ లు ఆడిన రాజస్థాన్ కేవలం మూడింట మాత్రమే గెలిచింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. మిగిలిన నాలుగు మ్యాచ్ లలోనూ గెలిస్తేనే ప్లేఆఫ్స్ అవకాశాలు ఉంటాయి. అందుకే ఇవాల్టి మ్యాచ్ ఆర్ఆర్‌కు చాలా కీలకం. ఇందులో ఓడితే నాకౌట్ ఆశలు వదులుకోవాల్సిందే. మరోవైపు ముంబయి వరుస విజయాలతో జోరు మీద ఉన్న విషయం తెలిసిందే.

# భారత్‌లో అర్షద్ నదీమ ఖాతా కూడా బ్లాక్

**పహల్గామ్ దాడి తర్వాత పాక్‌పై పలు చర్యలు తీసుకుంటున్న భారత్**

**ఇప్పటికే పాక్ సోషల్ మీడియా ఖాతాలు, యూట్యూబ్ చానళ్లపై నిషేధం**

**తాజాగా స్టార్ అథ్లెట్ అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా భారత్‌లో బ్లాక్**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో దాయాది దేశానికి సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలు, యూట్యూబ్ ఛానెల్స్ ను మన దగ్గర బ్లాక్ చేసిన భారత్... ఇప్పుడు పాక్‌కు చెందిన మరో క్రీడాకారుడి ఖాతాపై చర్యలకు ఉపక్రమించింది. ఆ దేశ స్టార్ అథ్లెట్, పారిస్ ఒలింపిక్స్ గోల్డ్ మెడల్ విజేత అయిన అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను భారత్‌లో నిలిపివేసింది.

ఇప్పటికే పాక్‌కు చెందిన నటీనటులు, పలువురు ప్రముఖుల సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో హనియా ఆమిర్, మహీరాఖాన్ అలీ జాఫర్, సనం సయీద్, బిలాల్ అబ్బాస్, ఇక్రా అజీజ్, ఇమ్రాన్ అబ్బాస్, సజల్ అలీ ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలే కాదు, 16 పాకిస్థానీ యూట్యూబ్ ఛానళ్లను కూడా భారత్ నిషేధించింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాయాది




దేశం పట్ల భారత్ కఠిన ఆంక్షలు విధిస్తోంది. సింధూ జలాల నిలిపివేత, భారత గగనతలం మూసివేత, పాక్ పౌరులను దేశం నుంచి వెళ్లగొట్టడం, దౌత్యపరమైన ఆంక్షలు వంటి చర్యలకు దిగింది.

# 2026 ఆసియా క్రీడల్లోనూ క్రికెట్‌కు చోటు

**గ్రీన్ సిగల్ ఇచ్చిన ఒలింపిక్ కమిటీ**

టోక్యో: 2026లో జపాన్ వేదికగా జరిగే 20వ ఆసియా క్రీడల్లోనూ క్రికెట్‌కు చోటు దక్కింది. ఆర్గనైజింగ్ కమిటీతో భేటి అనంతరం ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా ఈ విషయాన్ని వెల్లడించింది. తదుపరి ఆసియా క్రీడల్లో క్రికెట్‌తో పాటు మిక్సడ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడకు కూడా చోటు లభించింది. టి20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. 14 పురుష జట్లు, 9 మహిళల టీమ్స్ పాల్గొంటాయి. గత ఆసియా క్రీడల్లో టీమిండియా పురుషులు, మహిళల జట్లు స్వర్ణ పతకాలను సాధించింది.

ఆసియా క్రీడల్లో క్రికెట్‌ను తొలిసారి 2010లో పరిచయం చేశారు. ఆతర్వాత కేవలం రెండు సార్లు (2014, 2022) మాత్రమే ఆసియా క్రీడల్లో క్రికెట్‌కు అనుమతి లభించింది.

2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడంతో తదుపరి ఆసియా క్రీడల్లో కూడా క్రికెట్ నిర్వహణకు గ్రీన్ సిగల్ లభించింది. 1900 పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడం ఇదే మొదటిసారి. 2026 ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరుగుతాయి.

Printed published and THUDI NAGARAJU printed at YESHASHWIN printers,D.NO.2-5-1/1 GHANDHI NAGAR, GODAVARIKHANI, peddapalli district,,,505209, TELANGANA, published at D.NO.,7-3-34, janagam, Village , govt HOSPITAL LINE, GODAVARIKHANI TOWN,Ramagundam, mandal , peddapalli district T.S.505209,Editor :THUDI NAGARAJU,TELTEL 02091, email :Nagaraju.thudi@gmail.com,cell8985557050